క్లుప్తంగా

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



పట్టుబడ్డ వాహనాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గూడూరు రూరల్ : నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ చేపడుతున్నామని గూడూరు రూరల్ సీఐ కిశోర్‌బాబు తెలిపారు. గూడూరు రూరల్‌లోని టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం వేకువజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణ శివారు, రూరల్ ప్రాంతాల్లోని ఇళ్ల యజమానులు కొత్త వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. కొంతమంది నేరస్తులు ఇలాంటి ప్రాంతాల్లో ఉంటారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రూరల్, పట్టణ ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, గోపాల్, తిరుపతయ్య, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప వేదిక న్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మహబూబ్ బాషా



నియామక పత్రం అందుకుంటున్న షేక్ మహబూబ్‌బాషా

చిల్లకూరు : ప్రజల సమస్యలను వివిధ విభాగాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సంకల్ప వేదిక న్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన షేక్ మహబూబ్‌బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో ఉత్తర్వులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి ప్రజల సమస్యల పరిష్కారం కోసం 10 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో తాను కూడా ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు.

గూడూరును నెల్లూరులో విలీనం చేయండి



సమావేశమైన అఖిల పక్ష నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో విలీనం చేయాలని అఖిల పక్షం నాయకులు తీర్మానించారు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఆదివారం రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరును తిరుపతి జిల్లాలో కలిపారని తెలిపారు. ఇక్కడి ప్రజలు జిల్లా కేంద్రమైన తిరుపతి వెళ్లాలంటే వ్యయ ప్రయాసలకు లోను కావాల్సి వస్తోందని తెలిపారు. గూడూరును నెల్లూరులో విలీనం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కూడా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు విన్నవించారని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పేదలకు ఫలసరుకుల పంపిణీ



పేదలకు ఫల సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు


చిల్లకూరు : గూడూరు పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ జనార్దన రెడ్డి, రోహిణి దాతృత్వంతో 20 మంది పేదలకు ఒక నెలకు సరిపడా ఫల సరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలోని పేదలకు చేయూత ఇవ్వడంలో భాగంగా డాక్టర్ సీఆర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల దాతృత్వంతో సంక్రాంతి పండుగ కోసం ఫల సరుకులతో పాటు 15 మంది మహిళలకు చీరలు, ఐదురుగు పురుషులకు దుస్తులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు విజయభాస్కరరెడ్డి, కందాటి రాఘవరెడ్డి, ఎరమాకు క్రిష్టారెడ్డి, పలమాల హరినాథ్‌రెడ్డి, బత్తల శేషారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జనార్ధన్‌రెడ్డి కాలనీలో ముగ్గుల పోటీలు

వాకాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వాకాడులోని ఎన్‌జేఆర్ కాలనీలో ఆదివారం స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. 38 మంది మహిళలు వివిధ రకాల ముగ్గులు వేశారు. బాగున్న వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు డి.విజయ్‌కుమార్, టీడీపీ నేత మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలోని ఎంపీ చక్కెర ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు అమాస రామనారాయణ తెలిపారు. అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగా లక్ష కుంకుమార్చన చేపడతామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామని వెల్లడించారు.



మీజూరు, తనియారి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసినట్టు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

అంతా మోసం

- చేసింది గోరంత... చూపింది కొండంత
- పనులు పూర్తి కాకుండానే వెలసిన ఫ్లెక్సీలు
- క్షేత్ర స్థాయిలో కనిపించని అభివృద్ధి
- ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతి చోటా ప్రజలను మోసం చేస్తూనే ఉంది. ఏ పనీ చేయకుండానే చేసినట్టు ప్రచారం చేసుకుంటోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కింద మంజూరైన రూ.కోట్ల నిధులతో పలు పనులు చేసినట్టు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వాటిని చూసిన ప్రజలు విస్తుపోతున్నారు. ఇన్ని కోట్లతో తమ పంచాయతీల్లో పనులు చేశారా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేయకనే తప్పుడు లెక్కల ఫ్లెక్సీలు పెట్టి మోసం చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

దొరవారిసత్రం : మండలంలో 22 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.45 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు చూపుతూ పది రోజుల క్రితం పంచాయతీ కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వాటిలో చూపిన పనులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పూర్తి చేశారు. ప్రారంభం కాని పనులను సైతం పూర్తి చేసినట్టు, సాధించిన అభివృద్ధి అంటూ తెలపడం వెనుక ఏమి ఉందంటూ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పంచాయతీలోనూ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సీసీ రోడ్లు, చెరువుల అభివృద్ధి, ఫారం పాండ్లు, గోకులాలు, నీటి పారుదల, పంట కాలువల అభివృద్ధి, పంట పొలాల్లో పండ్ల మొక్కల పెంపకం తదితర పనులు చేసినట్టు తెలిపారు. తద్వారా వందల కుటుంబాలు ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఫ్లెక్సీల్లో ఉన్న అభివృద్ధి క్షేత్ర స్థాయిలో జరగలేదని ప్రజలు, ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుదోవ పట్టించడమే..

దొరవారిసత్రంలోని 29 పంచాయతీల్లో 22 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో 10 పనులు మాత్రం పూర్తి చేశారు. మిగిలిన పనులు మొదలు కావాల్సి ఉంది. అదే విధంగా గోకులాలు 22కు గాను 10 మాత్రమే పూర్తయ్యాయి. గ్రామాల్లోని అన్ని చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించినా పనులు చేపట్టలేదు. నీటి పారుదల, పంట కాలువల పునరుద్ధరణ పనులు అక్కడక్కడా అరకొరగా చేయించారు. ఫ్లెక్సీల్లో మాత్రం రూ.కోట్ల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని పేర్కొనడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపల్లిలో చెరువుకు వెళ్లే ప్రధాన పంట కాలువ దుస్థితి



మీజూరులో ఓ చెరువు దుస్థితి



సీసీ రోడ్డు వేయని మీజూరు పంచాయతీ బేరిజంగాలపల్లిలోని వీధి

చెరువులన్నీ దారుణంగా ఉన్నాయి



మీజూరు పంచాయతీ పరిధిలో చెరువుల అభివృద్ధి కోసం రూ.75 లక్షలు వెచ్చించినట్లు సచివాలయం వద్ద ఫ్లెక్సీలు వేశారు. ఈ చెరువు పనులు ఎక్కడ జరిగాయో అధికారులు చూపాలి. మీజూరులోని చెరువులన్నీ దారుణంగా ఉన్నాయి. కట్టలు బలహీనంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయపడుతున్నాము.

\- వీరస్వామి, మీజూరు

పది సీసీ రోడ్లు పూర్తి చేశాము

దొరవారిసత్రంలోని 22 పంచాయతీలకు 29 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.1.98 కోట్లు నిధులు విడుదలయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 10 పనులు పూర్తి చేశాము. మూడు చోట్ల పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనులు మొదలు పట్టాల్సి ఉంది. వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా చేపడతాము.

\- వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ

అవి ఈ ఏడాది చేయాల్సిన పనుల వివరాలు

దొరవారిసత్రం మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన పనుల వివరాల ను తెలుపుతూ ప్రతి పంచాయతీ కేంద్రంలోనూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశాం. ఆ పనులన్నీ పూర్తి కాలేదు. కొన్ని మాత్రమే చేపట్టాం. ఇంకా చేపట్టాల్సినవి ఉన్నాయి. లక్ష్యాల నిర్దేశంలో భాగంగా ఫ్లెక్సీలు వేశాం.

\- శ్రీనివాసులు, ఉపాధి హామీ ఈసీ, దొరవారిసత్రం

బోర్డుల్లోనే సీసీ రోడ్లు



గ్రామాల్లోని అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టి రూ.లక్షలు ఖర్చు చేసినట్టు బోర్డుల్లో పేర్కొన్నారు. వీధుల్లో మాత్రం రోడ్లు కనిపించడంలేదు. చేయని పనులు చేసినట్టు చెప్పి మోసం చేయడం ఎందుకు. చేతకానప్పుడు మేము చేయలేము అని అంగీకరిస్తే సరిపోతుంది. ఇలా తప్పుడు ప్రచారం చేయడం తగదు.

\- వెంకటేశ్వర్లు, బేరిజంగాలపల్లి

10న పెంచలకోనలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల శ్రీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బంగారు రంగులతో కూడిన ఏడు ద్వారాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బంగారు గరుడ వాహనంపై శ్రీవారిని కొలువుదీరుతారని వెల్లడించారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా శ్రీవారిని దర్శించినట్లు అనుభూతి పొందాలన్న ఉద్దేశంలో ఈ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 3 గంటలకు అభిషేకం, 5 గంటలకు పూలంగి సేవ, ఉత్తర ద్వార దర్శనం, ఉదయం 8 గంటలకు గోనుపల్లిలో గరుడ సేవ, గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

కండలేరులో 56.920 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.920 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,050, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

హైందవ శంఖారావానికి మద్దతుగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కోట: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి మద్దతుగా ఆదివారం కోటలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం, హిందూ ధార్మిక సంఘం ప్రతినిధులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ కోట నుంచి కోట క్రాస్ రోడ్డు మీదుగా విద్యానగర్ వరకు సాగింది. కార్యక్రమంలో అనంతాచార్యులు, నారాయణరావు, సుబ్బారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ఇళ్లకు సీసీ రోడ్డు

చిల్లకూరు : కూటమి నేతలు అధికారాన్ని యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద పల్లెలో నిర్మిస్తున్న రోడ్లను తమకు అనుకూలంగా ఇళ్లకు వేసుకుంటున్నారు. అధికారులు వారి అడుగులకు మడుగులు వత్తుతూ ప్రజల అవసరాలను విస్మరిస్తున్నారు. చిల్లకూరు మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.2 కోట్ల ఉపాధి హామీ నిధులతో 41 పనులు మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు 10 పనులు పూర్తి చేయగా మిగిలినవి ఇంకా ప్రారంభించలేదు. ఈ క్రమంలోనే తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు అనేది తీర్మానంతో పాటు ఆర్డర్ కాపీ లేకుండానే స్థానిక అధికార పార్టీకి చెందిన నాయకులు తమకు అనుకూలంగా ఉండేలా ఇంటికి రోడ్డు వేసుకున్నారు.



మొత్తం 125 మీటర్ల రోడ్డును 80 మీటర్లు ఒక వైపు చేసి మిగిలిన 45 మీటర్లను మరో వైపునకు మరల్చి పని కానిచ్చేశారు. దీనిపై పీఆర్ ఏఈ ఇలియాజ్‌ను వివరణ కోరగా ఆర్డర్ కాపీలో పంచాయతీ అని ఉందని, స్థానికుల ఇష్ట ప్రకారం ఎక్కడ కావాలంటే అక్కడ రోడ్డు వేసుకోవచ్చని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



కాటూరు గోపాల్‌రెడ్డి (ఫైల్)

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోపాల్‌రెడ్డి(80) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, నాయకులు గ్రామానికి చేరుకుని గోపాల్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు ప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఆదివారం జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఓటమి వెనుకే గెలుపు ఉంటుందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య మాట్లాడుతూ ఈ పోటీల్లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 10 బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన, నాయకులు శ్రీనివాసులునాయుడు, ఉదయ్‌కుమార్, రత్నయ్య, రాజేంద్రప్రసాద్, షబ్బీర్, గోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్



మురుగునీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కలువాయి: మండలంలోని తోపుగుంట అగ్రహారం గిరిజన కాలనీలో జ్వరాలు ప్రబలడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరం చేపట్టారు. వైద్య సిబ్బంది ఆదివారం డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర పీడితులను పరీక్షించి చికిత్స చేశారు. వైరల్ జ్వరాలు అదుపులోకి రావాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో బ్లీచింగ్, సున్నము చల్లించారు. పొదలకూరు సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ ఆదివారం గ్రామాన్ని సందర్శించి తగు సూచనలు అందజేశారు. అవసరమైతే మరో మూడు రోజులు వైద్య శిబిరం కొనసాగిస్తామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని డాక్టర్ అన్వర్ తెలిపారు.

ఘనంగా ఆదిశంకరలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ అనీల్ సహస్రబుద్దె

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 8వ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్ పర్సన్ వంకి అరవింద ప్రారంభించారు. ఇందులో న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ అనీల్ సహస్రబుద్దె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన ఉన్నత విద్యను అందిండతోపాటు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, వినూత్న ఆలోచనలతో ముందుకెళితే విజయం సాధించవచ్చని వివరించారు. అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కష్టపడాలన్నారు. ప్రస్తుతం ప్రతిరంగంలోనూ విపరీతమైన పోటీ ఉందని పేర్కొన్నారు. దాన్ని అధిగమించేందుకు కష్టపడాలన్నారు. అనంతరం 2023–24లో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు గోల్డ్, వెండి, కాంస్య పతకాలు, డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్, దుర్గాప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ వంకి అనూష, అకడమిక్ డీన్ ఎం.రాజయ్య, ఏవో రామయ్య, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి గోడ గడియారం వితరణ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి నెల్లూరుకు చెందిన సురేష్‌బాబు రూ.10 వేల గోడ గడియారం వితరణ చేశారు. ఆయన ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బందికి గడియారం అందజేశారు.

ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట



కాకాణి గోవర్ధన్ రెడ్డిని సత్కరిస్తున్న కిలివేటి సంజీవయ్య, తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి

- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఘన సన్మానం

నాయుడుపేట టౌన్ : కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ పోరాటాలు చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన ఆదివారం వైఎస్సార్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డితో కలిసి నెల్లూరులో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిశారు. శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమకు పదవులు ఇచ్చినందుకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షుల సారథ్యంలో పార్టీ ప్రతిష్టను పెంపొందించేలా పనిచేస్తామన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.



తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

కరెంట్ చార్జీలను విపరీతంగా పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ పోరుబాట పడతామని వెల్లడించారు. అనంతరం వారు తిరుపతిలో ఎంపీ గురుమూర్తిని కలిశారు. ఎంపీ నిధులు మంజూరు చేసి మండలాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని కోరారు. నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మీ, కలికి మాధవరెడ్డి, కటకం జయరామయ్య, ఒట్టురు కిషోర్‌యాదవ్, గంధవల్లి సిద్దయ్య, కట్టా భవాని రెడ్డి, దారా రవి పాల్గొన్నారు.

నేదురుమల్లి ఇంట నూతన ఉత్సాహం



రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నేతలు



రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

వాకాడువెంకటగిరి(సైదాపురం)/ దక్కిలి/రాపూరు/ సైదాపురం : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వాకాడులోని స్వగృహానికి చేరుకున్నారు. ఈ క్రమంలో వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చినా అండగా ఉంటానన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, దొంగ కేసులు పెట్టినా అధైర్య పడద్దొన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి శాలువతో సత్కరించారు. త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు



తొణుకుమాల సమీపంలో గ్రావెల్‌ను తవ్వుతున్న జేసీబీ

చిల్లకూరు: అధికార పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సహజ సంపదను యథేచ్ఛగా లూటీ చేస్తున్నారు. మండలంలోని తొణుకుమాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో గ్రావెల్ ఉంది. దానిపై కన్నేసిన అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు శుక్రవారం జేసీబీలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ గ్రావెల్ స్థానికంగా రూ.500లకు విక్రయిస్తుండగా, బయట ప్రాంతాల్లో రూ.1500 వరకు ధర పలుకుతోంది. గ్రావెల్ తవ్వకం విషయాన్ని స్థానికులు వీఆర్వో శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గ్రామ వీఆర్ఏను అక్కడికి పంపించారు. గ్రామంలో రోడ్ల మరమ్మతుల నిమిత్తం గ్రావెల్ తరలిస్తున్నామని కూటమి నేతలు చెప్పడంతో మిన్నకుండిపోయారు. వాస్తవానికి కూటమి నేతలు గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.